# యజ్ఞ

"వ్యాస శ్రీమతి"

"అబ్బే! ఇంకా ఇలా కూర్చుంటే ఆవిడ కదిలేట్టు లేదు." టపా బంట్రోతు పడేసిన ఉత్తరాల్లో ఒక్కటే శ్రీమతి పుట్టింటి దగ్గరనుంచి రాకపోయేసరికి ప్రకాశం ఉండబట్టలేక ఆ మాట అనేశాడు. టపా బంట్రోతు గుమ్మం సందులోనుంచి దూర్చిపోయాడు. కనుక అతనికి ఆ మాటలు వినిపించలేదే కాని, లేకపోతే అతడు నిలబడి అసలు విషయం తెలిసికొని ఫక్కున నవ్వేవాడు. నవ్వినంతలో తనకు పోయిం దేమీలేదు. నవ్వి వూరుకుంటాడా? వూళ్ళో పదిమంది దగ్గరా తన తెలివితక్కువతనాన్ని ప్రచారం చేస్తాడు. వాస్తవానికి తను తెలివితక్కువవాడేనా? అసంభవం. తను చేసినపని తెలివితక్కువదని యే మూర్ఖుడూ అనడు. మూర్ఖుడే కాదు బుర్రలో తెలివున్న మానవమాత్రు డెవడూ అనడు. బ్రహ్మచారి ముండావా శ్లైవళ్ళైనా అంటే అంటారు గాక. పెళ్ళిచేసుకొంటే దాన్ని పోషించలేమేమోనని భయపడే వాజమ్మల అభిప్రాయంతో తన కేమిటి? ఇప్పుడు చెయ్యాల్సిన దేమిటి? ఒక రోజా? రెండు రోజులా? సుమారు నెల దాటుతోంది. ఒక్క ఉత్తర మ్ముక్క కూడా లేదు కదా. ఔరౌర, ఎంత అన్యాయం? ఎంత ఘోరం! ఇది హిందూదేశమేనా? పవిత్రభారత వర్షమేనా? అసంభవం, పురుషుడు ఏకపత్నీ వ్రతుడుగా, భార్య పతివ్రతా ధర్మవర్తినిగా బ్రతికే దేశం ఇదేనా? నమ్మటం కష్టం. మూడు రోజుల్లో వస్తున్నానని వెళ్ళిన మనిషి మూడు మూళ్ళు తొమ్మిది మూళ్ళు ఇరవైయేడు రోజులకు పైగా మరో మూడు రోజులు దాటినా రావటం మాట అటుంచి, ఓ కార్డు ముక్కయినా వ్రాయకపోవడం సహించలేనిమాట. కాలం ఎంత మారిపోయింది! మారిపోతే పోవుగాక! బుద్ధిలేని కాలం మారిపోతే మనుషులు మారిపోతారా? అన్యాయం, అక్రమం, దుర్భరం, దుస్సహం! అని నాటక పాత్రధారిలా అనేసి సిగ్గుపడి వాలు కుర్చీలో వాలి సిగరెట్ ముట్టించాడు. తను మాత్రం ఏమన్నా తెలివితక్కువవాడా? మూర్ఖుడా? ఔను, అనేవాళ్ళు లేకపోయినా, కాదు అని ధీమా యిచ్చేవా డేడి? ఒక డిచ్చే దేమిటి? తన తెలివి తనకు తెలీదు కనకనా? కాలేజీ ఉత్సవాల్లో తనూ ఉపన్యాసాలిచ్చాడు. సారస్వత సంఘాల్లో తనకూ సభ్యత్వం ఉన్నది. పెద్ద పెద్ద పత్రికల్లో తను కూడా కథలూ,వ్యాసాలూ వ్రాస్తున్నాడు. కొత్తగా ఏదన్నా పుస్తకం వెలువడితే, అభిప్రాయార్థం అని వ్రాయబడ్డ ప్రతి తనకూ వస్తున్నది. ఛస్! అది వదిలేద్దాం. అది ఒదిలేసి చేసేదేమిటి? ఉత్తరాలన్నీ మరోసారి విప్పి చూశాడు. అబ్బే! తనకు దృష్టిదోషం లేదు. ఇలా ఎన్ని రోజులనుంచి చూస్తున్నాడు. ఆ! సరిగ్గా నెలదాటింది. ఆశ్వయుజ శుద్ధ సప్తమికి నెల కాదా? పోనీ శూన్యాలూ గీన్యాలూ తీసేస్తే యింకో రెండు రోజులు కదా! అక్కడికి ఇవాళ దశమి. అయినా, ఉత్తరం ముక్కలేదే. ఇప్పు డేమిటి కర్తవ్యం? ఏమీ లేదు విడాకులకు దరఖాస్తు చేయటమే. అమ్మయ్యో—ఇంకేమన్నా ఉందా? ప్రమీలాదేవి వంటి ఉత్తమ గృహిణికి విడాకు లిచ్చి తను చేసేదేమిటి? తను వెయ్యి జన్మలు సక్రమంగా సమాధిలో కూర్చుని తపస్సు చేసినా ప్రమీలాదేవివంటి గృహలక్ష్మిని, ఉత్తమ గృహిణిని సంపాయించలేనని యిదివరకే అనుకున్నాడు. అసలు అటువంటి వూహ తట్టడమే అన్యాయం అనుకొని, లెంపలు వాచేటట్టు కొట్టుకొన్నాడు. ఆవిడ కాపరానికొచ్చిన నాలుగేళ్ళమధ్య సంవత్సరానికి వారం రోజులకంటే తనను విడిచివుండటం లేదు. అందుచేత నని చెప్పి ఇప్పుడు ఏకంగా ఓ సంవత్సరం అక్కడే ఉండిపోతుందా? ఏమిటీ? బాగు, బాగు, ఔనను కొండి ఆవిడ విజయదశమి ముందే వెళ్ళింది. దీపావళి దాటేవరకూ ఉంది. అంతేనా! దీపావళి వెళ్లి పదిరోజులయినా జాడా—జాబూ లేదు. లదీ ఆలోచించాల్సిందే. తను మాత్రం ఓ కార్డుముక్క వ్రాస్తాడా? ఇంట్లో అందరినీ ఎదిరించి తనను పెళ్ళిచేసికొన్న పెళ్ళాం పుట్టింటికి వెళ్ళి నెల దాటుతూంటే ఒక్కకార్డు ముక్క వ్రాయలేదు. అయితే, తను మగాడు, మగవాడయితే ఆడపిల్ల యోగక్షేమాలతో నిమిత్తం లేదా? ఉంటే మాత్రం ! నా పెళ్ళాం పిల్ల ఆరోగ్యం ఎలా గుందని ఉబలాటంతో ఉత్తరం వ్రాస్తే నలుగురూ నవ్విపోరూ? అంతకన్న తెలివి తక్కువ ఏమన్నావుందా? పోనీ తన యోగక్షేమాలు తెలుపుతూ, ఆవిడ సౌభాగ్యాన్ని ఆకాంక్షిస్తూ ఆవిడకే వ్రాయవచ్చుగా! తన ఆరోగ్యం పాడయితే కదా, అలాంటి ఉత్తరం వ్రాయటం. ఏది ఏమయినా ఉత్తరం వ్రాయాల్సిన బాధ్యత తనమీదకన్న ఆవిడ మీదనే వుంది.

ఈ విషయాన్ని ఆవిడ గుర్తించలేదు కనుక తను బయలుదేరి వెళ్ళి నలుగురిలోనూ అయితే తన భార్య తననే పరిహసిస్తున్నదని భావిస్తారు. కనుక హాంగుగా రహస్యంగావుండి పెద్ద బావమరిది గదిలోకి పిలిచి తలుపు గడియవేయకుండా జేరవేసి, పెద్ద పెద్ద మాటలతో తక్కువ ధ్వనితో మందలించాలి, అనుకుంటూనే వీధిలోకి నడచి జేబులో చెయ్యి పెట్టాడు. తాళాలు దొరకలేదు. తిరిగి ఇంట్లోకివచ్చి తాళాలు తీసికొని తలుపు బిగించి వీధిలో అడుగుపెట్టి, రిక్షా ఎక్కి కూర్చున్నాడు. రిక్షావాడు ఏ సూచనా లేకుండానే రైలుస్టేషనుకు తీసికెళ్ళాడు పాపం! ప్రకాశం కాఫీ కోసం బయల్దేరాడు. హోటల్ దగ్గ రదిగి హడావుడిగా కాఫీ గొంతులో పోసికొని 'స్టేషన్' అన్నాడు. రిక్షా ఆగేసరికి స్టేషలో బండి ఆగి వుంది. ఒక్క ఉరకలో వెళ్ళి గేట్లో పడ్డాడు. తీరా చూస్తే అది తను చేరవలసి నగరం నుంచి వచ్చినబండి. దీర్ఘంగా నిట్టూర్చి వెనుదిరిగేసరికి రిక్షావాడు చేతులు నలుపుకొంటూ నిలబడ్డాడు. వాడి చేతిలో రూపాయి కాగితం పారేసి బుకింగ్ లోకివెళ్ళి వాకబుచేస్తే తను ఎక్కవలసిన బండి ఇంకా గంటన్నర వరకూ రాదని తెలిసింది. ఒళ్లు మండిపోయింది. వంద తేళ్ళా ఒక్కసారిగా ప్రాకి కుట్టినట్లయింది. ఛా అనుకొంటూ వెయిటింగ్ రూములో పడ్డాడు. "సరిగ్గా దశమి వెళ్ళిన మూడోనాటి కల్లా వచ్చితీరుతానని చెప్పి వెళ్ళింది. "అక్కర్లేదు. ఓ వారం వుండిరాఅన్నాడు. "అలా ఉంటే హమ్మయ్యో! ఇంకేమన్నా ఉందా? అన్ని రోజులూ మీరు హోటల్లో—మీ ఆరోగ్యం సర్వనాశనం అయిపోదూ? శాపాదపి శరాదపి నేను త్రయోదశి నాడు బయలుదేరివ చ్చేస్తాను" అంది. సరే కానిమ్మన్నాడు. అంతే అక్కడికి వెళ్ళేసరికి ఆవిడ పూర్తిగా ఈ ప్రపంచాన్ని మరచిపోయింది.

ఆవిడ బి. ఏ. పాసయితే ఆ విజ్ఞానంతో తనకు పుట్టబోయే బిడ్డలకు శిక్షణ ఇచ్చుకొని వాళ్ళను కేంద్ర ప్రభుత్వానికి సలహా సంఘంగా పంపుకోవాలి. ఆవిడ ఆస్తి కలవాళ్ళ బిడ్డ అయితే మరో నాలుగు చీరలూ ఓ అరడజను చంద్రహారాలూ తెచ్చుకోవాలి. ఆవిడ తెలివి కలదయితే కథలమీదా నవలల మీదా చక్కని విమర్శలు వ్రాయాలి. అంతేకాని పుట్టింటికి పోయి కూర్చుని మొగుడనే వాడొహడు తనకోసం కాచుకూర్చున్నాడని తెలిసికోకుండా ఒక్క ఉత్త

రము ముక్క అయినా వ్రాయకుండావుంటుందా? ఈ విషయాలన్నీ విడివిడి అడిగేస్తాను.

ఇలా ఆలోచించుకుంటూ ఉండగానే ప్లాట్‌ఫారం మీద బండి ఆగింది. పరుగు పరుగున పోయి టిక్కెట్టు తీసికొని రైలెక్కబోతూచూచే సరికి అదే పెట్టెలోంచి ఎవరో ఆడమనిషి మీద పడ్డంత పనిచేసింది. అతనికో అనుమానం కలిగింది. వెనుదిరిగి చూశాడు. అబ్బే! అలా వచ్చే రకం కాదు అదీకాక ఈ రైల్లో ఎందుకు వస్తుంది? అనుకుంటూనే ఎక్కేశాడు. తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు. సామాను చేత్తో పట్టుకొని దిగబోయే మనిషి తనవరకూ వచ్చి ఆగిపోయింది. ఒక్కసారి చూసి తల ప్రక్కకు త్రిప్పేశాడు.

"మన వూరు వచ్చేసింది దిగుదాం రండి అని మోకాళ్ళతో అతని మోకాళ్ళను నెట్టింది. తనను కాదన్నట్లు బిగుసు క్కూర్చున్నాడు. "మిమ్మల్నే బండి ఖాళీ అయిందిగా. అవతల బండొస్తే ఇంక దిగలేం కూడా. దానిలోనుంచి గుంటూరు జనం దిగుతుంది."

అని సంచీ అతనిచేతి కందిచ్చి కూలీని పిలవండి పెట్టే, బెడ్డింగూ ఉన్నాయి అన్నది.

అతను ఏమనుకున్నాడో ఏమో సంచీతో రైలుదిగి కూలీని చేత్తోనే పిలిచి పైకి పంపించాడు. మాట్లాడకుండా నడుస్తూ అప్పుడేకొన్న టికెట్ గేట్లో యిచ్చే సరికి 'టికెట్' కలెక్టరు తెల్లబోతూ, ఒరే ప్రకాశం, ఇది నువ్వెక్కవలసిన బండి టిక్కట్‌రా అన్నాడు. ప్రకాశం వెనుదిరిగి వచ్చి పాత స్నేహితుణ్ణి రెండు ప్రశ్నలువేసి వాడిని మరపించబోయే ప్రయత్నంలో ప్రమీల 'టికెట్' ఇవ్వకుండా వెళ్ళిపోతోంది, ప్రకాశం రోడ్డుమీద కొచ్చేసరికే ఆమె బండిలో కూర్చుని స్వారగారండి అన్నది. అతను సంచీ బండిమీద తలేసి రిక్షావాణ్ని పిలిచి ఎక్కి కూర్చున్నాడు. బండికన్న ముందుగనే రిక్షా ఇంటికి చేరింది. తలుపు తీసుకొని వాకిట్లో కుర్చీలో నడుం వాల్చి సిగరెట్ ముట్టించి ఆలోచించ సాగాడు.ఏమయినా ఆమెతో మాట్లాట్టానికి వీల్లేదు. అప్పుడే తను రైలెక్కితే అక్కడే దిగమంటుందా? తను ఎక్కటం చూసిన వాళ్ళేమనుకుంటారు? పైగా టికెట్ లేకుండా ప్రయాణం చేయబట్టి కదా, వాడు ఆ విసురు విసిరాడు. దీనికి తగిన ప్రాయశ్చిత్తం చేయాలి. గుమ్మం ముందు బండి ఆగింది. ఆవిడ టకటక లోపలకొచ్చి వంటింట్లోకి నడుస్తూ బండివాడికి డబ్బిచ్చేయండి అంది. అతనికి చిర్రెత్తింది. ఇంత కాలం పుట్టింటి దగ్గరుండి కానీ చేతబట్టుకు రాకుండా వచ్చిందా? బాగుంది. అంచేతనే రైలుకి టికెట్ కొనలేదు. నేను కనిపించకపోతే ఏం కావల్సింది? అనుకుంటూ బండివాడికి డబ్బిచ్చి పంపేశాడు.

ఆ సంచీలో తువాలిలా పారేయండి. కాస్త స్నానం చేస్తేకాని అంటూ దొడ్లోకి నడిచింది. అతని ఆగ్రహానికి ఆజ్యంధారగా పోస్తూనేవున్నది. అతను దండెం మీది తువాల్ విసురుగా విసరుతూ కుర్చీలో కూర్చున్నాడు. అతని మనస్సు అనేక విధాలుగా ఆలోచించసాగింది. ఏమయినాసరే ఆమెతో తను మాట్లాడ కూడదు అనే నిర్ణయానికి వచ్చేడు. ఆమె తన తెలివి తేటలని ఉపయోగించితననుపలకరించడానికి ప్రయత్నించినా సరే తను ఉలక్కుండ పలక్కుండ కూర్చోవాలి.ఆమె లోపలకు వచ్చి పెట్టె తెరచి నల్లంచు తెల్ల చీర కట్టుకొని దువ్వెనతో జుట్టు సరిజేస్తూ దగ్గరగా వచ్చి—ఒంట్లో ఏమీలేకుండా ఉంటోందా? వెధవ పోటాలు మెతుకులు కూడా అన్నది గోడ వారనున్న స్టూల్ దగ్గరగా తీసుకొని కూర్చుంటూ. అతను ముఖం ప్రక్కకు త్రిప్పేసి నుదురుమీద చెయ్యేసుకున్నాడు. ఆమె నడి నెత్తిమీద దువ్వెన్ను బిగించేసి, అతని నుదురు మీద చెయ్యివేసి—

హమ్మయ్యో! ఎంత వేడిగా ఉందో? తల పోటుగా ఉందా? కాస్త అమృతాంజనం రాస్తాను.

అంటూ లేచి పెట్టెలోంచి సీసాతీసి చేతులోకి కొంత తీసికొని అతని నుదురుమీదరాసి రుద్ద సాగింది. అతడు తీవ్రంగా ఆమె చేతిని నుదురు మీదనుంచి తీసేశాడు. ఆమె చిరునవ్వును పెదవుల మధ్య బిగించి, ఏమిటిదీ? తలనొప్పిగా వుంటే కాస్త మర్దనచేసికోక అని తిరిగి చెయ్యి చేర్చబోయింది. ఈసారి అతను ఆమె చేతిని నుదురుకు తగలకుండానే వారించాడు. ఆమె నెమ్మదిగాలేచి స్టౌ తీసి వెలిగిస్తూ, కాస్త ఓవల్టిన్ పెడ్తాను అన్నది.

అతను కుర్చీలోంచి లేచి పడకగదిలో వున్న కాల బీరువాతీసి, 'లా' పుస్తకం తీసి, వచ్చి మామూలుగా కుర్చీలోవాలి 'విడాకుల' బిల్లు పరిశీలించసాగాడు. అందులో నిర్దేశింపబడిన కారణాలేవీ తమ మధ్య లేవు. తమ మధ్య నున్న యీ భేదాన్ని కోర్టు అంగీకరించదు. ఇలా అను కుంటుండగనే ఆమె గ్లాసుతెచ్చి అందిస్తూ—

'కాస్త త్రాగండి, నీరసం తగ్గితే అదే పోతుంది అన్నది. అతను గ్లాసు అందుకొని మాట్లాడకుండా త్రాగేసి తిరిగి శాసనం చూడ సాగాడు. ఆమె సంచీలోనుంచి పొట్లం తీసితెచ్చి మీకు బాగా ఇష్టమని మా అమ్మమ్మ పచ్చి చలిమిడిచేసి ఇచ్చింది. కొబ్బరికాయ ముక్కలు కూడా వేసింది.

పళ్లెంలో పెట్టి స్టూల్‌మీద ఉంచుతూ అన్నది. పచ్చి వెలక్కాయలా నా గొంతుకలో అడ్డుపడమని నిన్ను పంపలేదు అన్నాడుతీవ్రంగానే

పోన్లెండి, అలా అయితే నేను మళ్ళీపోతాను. మీకు ఇష్టం అని పచ్చిచలిమిడితెస్తే పచ్చి వెలక్కాయనా నేను? అని 'వరూధిని కోపాన్ని' ప్రదర్శించింది.

అతను మౌనంగా చలిమిడి ఉండలుచేసి మింగ సాగాడు. ఆమె పెట్టెలోంచి పర్సుతీసి అతని దగ్గరకువచ్చి అందించింది. అతను ఆతురతగా విప్పాడు. విప్పుతుండగానే సెకండ్ క్లాస్ టికెట్ క్రింద పడింది. దాన్ని చూడకుండానే అతను పర్సులో కాగితాలు తీసి—

"భర్త అనుమతి కానిదే పుట్టింట ఎక్కువ కాలం ఉన్నందుకు పుట్టింటివాళ్ళు చెల్లించాల్సిన జరిమానా నాలుగువందలు" అంటూ నాలుగు కాగితాలు పైకెత్తాడు.


# తరచుగా మూత్ర విసర్జన

తరచుగా మూత్రం విసర్జించడం ప్రమాదకరమైన చిహ్నం. అది శరీర తత్వాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, రోజు రోజుకూ రోగిని మృత్యు సమీపానికి తీసుకవస్తుంటుంది. ఆరంభంలో శారీరకంగా కానీ, మానసికంగా కానీ శ్రమపడడానికి అయిష్టత, నడుం నొప్పి, దృష్టి మాంద్యం, తొడలవద్ద తిమ్మిరి, సర్వసాధారణంగా బలహీనత మొదలైన లక్షణాలు కనబడుతూ వుంటవి. ఈ లక్షణాలు గోచరించడంతోనే తగిన చికిత్స చేయకపోతే, వుత్తరోత్తరా అమిత దాహం, ఆకలి, నోరు, గొంతు ఎండుకపోవుట, దురద, కాళ్లలో సంకటం, బరువు తగ్గడం, శరీరమంతా పోట్లు, కీళ్లవాతం, కళ్ళ పొర, టి. బి., కురుపులు, రాచపుండు, తదితర తీవ్ర వ్యాధులకు గురి కావలసి వస్తుంది. "వీనస్ చారం" బిళ్లలు వాడి వేలాది మంది శమనం పొంది మృత్యువాత పడకుండా తప్పించుకొన్నారు. "వీనస్ చారం" బిళ్లలు ప్రాచీన యునాని వైద్య సిద్ధాంతం ప్రకారం శాస్త్రీయంగా, అరుదైన మూలికలతోను, వనస్పతుల సారములతోను, స్వాభావికమైన క్షారములతోను తయారుచేయబడ్డవి. ఈ చికిత్స మొదలుపెట్టిన రెండవ లేదా మూడవ రోజునుంచే అమిత దాహం తగ్గి తరుచుగా మూత్ర విసర్జన చేయడం నిలిచి పోతుంది. కొద్ది రోజులలోనే మీకు సగానికి పైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ చారం" ఖర్చు తక్కువ. నిరపాయమైనది. తీసుకొనడం సులభం. ప్రత్యేక కఠిన పథ్యాలు కానీ, వుపవాసాలు చేయవలసిన అవసరం కానీ వుండవు. రోగులు పుష్టికోసం బలప్రదమైన వివిధ పదార్థములను భుజించవచ్చును. కోరిన వారికి పూర్తి వివరాలు కల సారస్వతం ఇంగ్లీషులో పంపబడును. 50 బిళ్లల ఖరీదు రు. 6.75 న.పై. మాత్రమే. ప్యాకింగు,పోస్టేజివుచితం.దొరకుచోటు

వీనస్ రీసర్చి లేబరేటరి,

(A.H.W.)

పో. బా. నం. 587, కలకత్తా.